చవితి సందడి



బుజ్జి గణపయ్యలను విక్రయిస్తున్న మహిళ

నందిగామరూరల్/జగ్గయ్యపేటఅర్బన్: వినాయక చవితి పండుగ నేపథ్యంలో జగ్గయ్యపేట, నందిగామ పట్టణాల్లో మంగళవారం సాయంత్రం సందడి నెలకొంది. నందిగామలోని మెయిన్‌బజార్, జగ్గయ్యపేటలోని రైతుబజార్ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారి పత్రి వ్యాపారులతో నిండిపోయి సందడిగా మారింది. చిన్నచిన్న మట్టి వినాయకుల స్టాల్స్‌తోపాటు పూజకు అవసరమైన పత్రి, పండ్లు, వినాయక మంటపాలను అలంకరించే సామగ్రి దుకాణాలు జనంతో కిటకిటలాడాయి. పండగ కోసం పాలవెల్లి, పత్రికాయలు, ఎలక్కాయలు, మారేడు పండ్లు, కలువపూలు, జిల్లేడు, ఉమ్మెత్త కాయలు, నారింజ, మునురికాయలు, జామ, మేడి పండ్లు, దబ్బకాయలు, బంతిపూలు, మామిడి, అరటి ఆకులు, పూలు విక్రయాలు జోరుగా సాగాయి. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగ కావడంతో ప్రజలు భారీగా తరలివచ్చి పత్రి, ఇతర పూజాసామగ్రి కొనుగోలు చేశారు. బండ్లపై పలురకాల మట్టి విగ్రహాలు ఆకర్షణీయంగా ఉండటంతో వాటిని కొనేందుకు ప్రజలు ఆసక్తిచూపించారు. మట్టి వినాయకులను కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలతో నందిగామ, జగ్గయ్యపేట పట్టణాలు కోలాహలంగా మారాయి. ఇక ఆయా కూడళ్లు, గ్రామాల్లో వినాయకుడి విగ్రహాల ఏర్పాటు కోసం భక్తులు మంటపాలను ఏర్పాటు చేశారు. మంటపాలను విద్యుత్‌దీపాలు, తోరణాలతో ప్రత్యేకంగా అలకరించి గణనాథుడిని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తున్న నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ



నందిగామ మెయిన్‌బజారులో పత్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు



జగ్గయ్యపేటలో పూజసామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు



కొనుగోలుదారులతో సందడిగా ఉన్న పేట రైతుబజారు సెంటర్



జగ్గయ్యపేటలో పండ్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

క్లుప్తంగా

విద్యార్థులకు అవగాహన



కొణకంచి(పెనుగంచిప్రోలు): సీజనల్ వ్యాధుల విషయంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి కె.వాణి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల బారి నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజు, ఉపాధ్యాయులు శివకుమార్ పాల్గొన్నారు.

మురుగు నీరు తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

జగ్గయ్యపేట: మండలంలోని రావిరాల గ్రామంలో పారిశుద్ధ్యం పరిస్థితి అధ్వాన్నంగా ఉండటంపై 'సాక్షి' దినపత్రిక 'రావిరాలలో పారిశుద్ధ్యం అధ్వానం' శీర్షికన ప్రచురించిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. గ్రామంలోని సత్యమ్మ అమ్మవారి ఆలయం వద్ద మడుగులా ఉన్న మురుగు నీటిని మంగళవారం పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఈ పనులను పంచాయతీ కార్యదర్శి సంక్రాంత్ పర్యవేక్షించారు. సమస్య పరిష్కారానికి కృషిచేసిన 'సాక్షి' దినపత్రికకు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి మంగళవారం హైదరాబాద్, హుమాయన్‌నగర్‌కు చెందిన కావాటి రవికుమార్, భగవతి దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ ధర్మకర్తలు బెజవాడ శ్రీనివాసరావు, పాలాది వెంకటరమణ చేతుల మీదుగా విరాళం అందజేశారు. రూ.50 వేలు నిత్యాన్నదాన పథకానికి, రూ.50 వేలు గోవుల సంరక్షణకు వినియోగించాలని కోరారు. అనంతరం ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి జగ్గయ్యపేట పట్టణానికి చెందిన లంకా పాండురంగారావు దంపతులు రూ.50,116లను విరాళంగా అందించారు. దాతలకు ఆలయ ఈవో సాంబశివరావు స్వామివారి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భరద్వాజ్, అర్చకులు రామకృష్ణమాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదుతో అనేక ప్రయోజనాలు : ఏడీఏ



చెవిటికల్లు(కంచికచర్ల): మండలంలోని చెవిటికల్లులో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు శిక్షణనిచ్చారు. ఈసందర్భంగా జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మనీషా మాట్లాడుతూ రైతులకు పంట నమోదు ఆవశ్యకతను వివరించారు. ఎరువుల వినియోగం తగ్గించి నానో యూరియా, నానో డీఏపీ జీవన ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నందిగామ ఏడీఏ ఐకే శ్రీనివాస్, ఏవో కె.విజయకుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు ఉదయ్‌కిరణ్, మనీషా, గౌతమ్, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టిపెట్టాలి

ఎంపీపీ మార్కపూడి గాంధీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గాంధీ, పక్కన జెడ్పీటీసీ నాగమణి, సిద్దారెడ్డి

పెనుగంచిప్రోలు: అధికారులు ప్రజాసమస్యలపై దృష్టి పెట్టి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం పెనుగంచిప్రోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మునేరు తువ్వకాలువకు గండ్లు పడి ఏడాది అవుతున్నా నేటివరకు పట్టించుకోలేదని ఎంపీపీతోపాటు పలువురు సభ్యులు ప్రశ్నించగా, వారం రోజుల్లో ఇరిగేషన్ సీఈ వచ్చి పరిశీలిస్తారని సిబ్బంది తెలిపారు. సుబ్బాయిగూడెం నుంచి నందిగామ వరకు మధ్యలో ఐదు గ్రామాలు ఉన్నాయని ఉదయం, సాయంత్రం బడిబస్సు తప్ప ఒక్క ట్రిప్పు కూడా లేదని ఎంపీటీసీ సభ్యులు వెల్ది ప్రభాకర్ ప్రశ్నించగా త్వరలో కొత్త బస్సులు వస్తాయని ఆర్టీసీ ఉద్యోగి రమణ తెలిపారు. డీటీ నాగుల్‌మీరా మాట్లాడుతూ మండలంలో 18,191 కుటుంబాలకు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. భూముల సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాంచారావు మాట్లాడుతూ మండలంలో 1153 ఇంటింటి కుళాయిలు మంజూరైనట్లు తెలిపారు. మునేరులో వరద తగ్గాక లింగగూడెం తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని, ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు. ఎంపీపీ గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి మాట్లాడుతూ గ్రామాల్లో దోమల నియంత్రణపై అధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం మెరుగును చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశాంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.సిద్దారెడ్డి, డెప్యూటీ ఎంపీడీఓ కె.సుబ్బారావు, ఎన్ఎస్‌పీ, ఆర్అండ్‌బీ ఏఈలు గోపి, కిషోర్, ఏపీఓ జనార్దనరావు, ఏపీఎం రమణ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన బాధితులు



పెనుగంచిప్రోలు: అక్రమ కేసుల కారణంగా జైలుపాలైన వైఎస్సార్ సీపీకి చెందిన కార్యకర్తలు, సానుభూతిపరులు వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఆపార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలో కలిశారు. ఈ ఏడాది మార్చి నెలలో పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి చిన్నతిరునాళ్లలో భాగంగా పుట్టింటి పసుపు–కుంకుమ బండ్లు వచ్చిన రోజు జరిగిన ఘర్షణలో టీడీపీ నాయకులు దాడిచేయడంతోపాటు అక్రమంగా కేసులు బనాయించడంతో జైలుపాలైన వైనాన్ని బాధితులు జగన్‌కు వివరించారు. పోలీస్‌వారు సైతం ఏకపక్షంగా వ్యవహరించిన తీరును మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డికి వివరించినట్లు ఆపార్టీ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోటేశ్వరరావు తెలిపారు.

ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మౌనం వీడాలి : తన్నీరు



నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు, పక్కన చిన్నా, నేతలు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మార్కెట్ యార్డు చైర్మన్ పదవి కేటాయింపు అంశంపై ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) మౌనం వీడి ఎస్సీలకు న్యాయం చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఎస్సీ మహిళకు కేటాయించిన మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని అగ్రవర్గానికి కట్టబెట్టాలని చూస్తున్న కూటమి నాయకుల కుటిలయత్నాలకు నిరసనగా వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం నాయకులు, ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం రైతుబజారు సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వు చేసినప్పటికీ ఆ పదవిని కూటమి నాయకులు ఓసీలకు కట్టబెట్టాలని కుట్రలు చేయడం అప్రజాస్వామికమన్నారు. ఎస్సీలు ఉన్నత పదవుల్లోకి రావడం వారికి ఇష్టం లేకనే కొంతకాలంగా ఓసీలకు కేటాయించాలని ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నామినేటెడ్ పదవులు నచ్చినవారికి కాకుండా అందరికీ దక్కాలనే ఉద్దేశ్యంతోనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ పదవులకు కూడా రిజర్వేషన్లు తీసుకువచ్చారని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే జగ్గయ్యపేట మార్కెట్ యార్డు చైర్మన్ పదవి 2019–24 మధ్య కాలంలో బీసీ మహిళ రిజర్వు చేసి సామాజిక న్యాయం పాటించారని వివరించారు. కూటమి ప్రభుత్వం మాత్రం నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్ పద్ధతిని కాలరాసి స్వంత రాజ్యాంగాన్ని అమలుచేస్తున్నారని ఆరోపించారు. దళితులకు అన్ని అవకాశాలు ఇస్తున్నామంటున్న కూటమి నేతల ప్రసంగాలు మాటలకే పరిమితయ్యాయని ఎద్దేవా చేశారు. ఈ విషయంపై ఇంతటి రాద్ధాంతం జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. మార్కెట్ యార్డు చైర్మన్ అంశంపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ఎమ్మెల్యే రాజగోపాల్‌పై ఉందన్నారు. లేనిపక్షంలో దళితులతో కలిసి వైఎస్సార్ సీపీ తరపున పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్(చిన్నా), నియోజకవర్గ ఎస్సీ నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి కృషి : సౌమ్య



స్త్రీశక్తి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, నాయకులు

నందిగామటౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళా పక్షపాతి అని, మహిళల సంక్షేమాన్ని అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారని ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో మంగళవారం స్త్రీశక్తి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలుచేస్తోందని తెలిపారు. అనంతరం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మండవ కృష్ణకుమారి, నాయకులు ఆచంట సునీత, బచ్చుల సుబ్రహ్మణ్యం బోస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీలే బాధ్యత వహించాలి

వత్సవాయి: వినాయకచవితి సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసే మంటపాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాల్సిన బాధ్యత కమిటీ సభ్యులదేనని తహసీల్దార్ వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. వినాయకచవితి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పలు శాఖలకు చెందిన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే విగ్రహాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏవో ఎస్.రాంబాబు, ఏఎస్ఐ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి మాతృభాష దోహదం



విజేతలకు బహుమతులు అందిస్తున్న రిటైర్డు అధ్యాపకుడు డాక్టర్ లగడపాటి సంగయ్య

నందిగామటౌన్: విద్యార్థుల మెరుగైన జ్ఞాన పరమైన పురోగతికి, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి మాతృభాష దోహదపడుతుందని కేవీఆర్ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ లగడపాటి సంగయ్య పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని అక్షర కళాశాలలో మంగళవారం చైతన్య దీపిక సంస్థ ఆధ్వర్యంలో తెలుగు భాషా సాంస్కృతిక సారధి–2025 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్య, ఉద్యోగ, వైజ్ఞానిక అవసరాల కారణంగా మాతృభాష ప్రాముఖ్యత తగ్గుతుందన్నారు. ఇటువంటి పరిస్థితులలో తెలుగుభాషను కాపాడుకోవడంతోపాటు దాని ఆవశ్యకతను విద్యార్థులకు చెప్పాల్సిన అవసరముందన్నారు. అనంతరం పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చైతన్య దీపిక సంస్థ ప్రతినిధులు మాదాసు సత్యనారాయణ, లెనిన్‌కుమార్, మానస, చిక్కుళ్ల రాఘవ, పలువురు నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే వినియోగించాలి



మట్టి వినాయకుడి విగ్రహాలతో వెల్లంకి పాఠశాల విద్యార్థులు



మట్టి విగ్రహాలను పూజిద్దామని నినాదాలు చేస్తున్న విద్యార్థులు

నందిగామరూరల్: పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక గాంధీసెంటరులో ప్రజలకు 4850 వినాయకుడి మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.బాలకృష్ణ పాల్గొని విగ్రహాలను పంపిణీ చేశారు. ఏటా మట్టి ప్రతిమలను అందిస్తున్న సమితి అధ్యక్షుడు రామిరెడ్డి శ్రీధర్‌ను అభినందించారు. కమిషనర్ లోవరాజు, ఎంపీడీవో శ్రీనివాసరావు, దంత వైద్యుడు మహేంద్ర, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయం వద్ద..

నందిగామటౌన్: పట్టణంలోని అయ్యప్పస్వామి వారి ఆలయం వద్ద మంగళవారం మాజీ ఎంపీపీ కోవెలమూడి వెంకట నారాయణ 1000 మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ కోవెలమూడి వెంకటనారాయణ

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: వెల్లంకి మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులచే ఉపాధ్యాయులు మంగళవారం మట్టి వినాయకుడి విగ్రహాలను తయారు చేయించారు. హెచ్‌ఎం శైలజ, ఉపాధ్యాయులు వేణుగోపాల స్వామి, నసీమా సుల్తానా, రేవతి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో

జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక విజ్ఞాన్ స్కూల్‌లో విద్యార్థులచే మట్టి వినాయక విగ్రహాలను తయారుచేయించి ప్రజలకు పంపిణీ చేశారు.స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి మాట్లాడుతూ వినాయకచవితి విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

విద్యార్థులకు పోటీలు



నందిగామరూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు పోటీలు ఎంతో దోహదపడతాయని చందాపురం జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులకు మంగళవారం మట్టి వినాయకుల విగ్రహాల తయారీ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి పోటీల కారణంగా విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని వివరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ



కంచికచర్లలో మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న సీఐ చవాన్‌దేవ్

కంచికచర్ల: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ వినాయకుడి మట్టి విగ్రహాలను పూజించాలని నందిగామ రూరల్ సర్కిల్ సీఐ చవాన్‌దేవ్ అన్నారు. స్థానిక నెహ్రూబొమ్మ సెంటర్‌లో మంగళవారం వాసుదేవ మిత్ర మండలి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు 1000 వినాయక మట్టి ప్రతిమలను సీఐ చవాన్‌దేవ్ చేతులమీదుగా ప్రజలకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందమైన ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. మట్టి ప్రతిమలని పంపిణీ చేసిన వాసుదేవ మిత్ర మండలి సభ్యులకు అభినందించారు. అదేవిధంగా కంచికచర్లలో నందిగామ నియోజకవర్గ ప్రెస్‌క్లబ్ సభ్యులంతా కలిసి 500 గణనాథుడి మట్టి ప్రతిమలను సీఐ చవాన్ చేతుల మీదుగాద ప్రజలకు పంపిణీ చేశారు.

పాడిరైతులకు బోనస్ పంపిణీ



నందిగామరూరల్: పాడి రైతులను ప్రోత్సహించడమే కాకుండా వారి సంక్షేమానికి కృష్ణామిల్క్ యూనియన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని కేడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ పేర్కొన్నారు. మండలంలోని మాగల్లులో మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో రూ. రెండు లక్షల బోనస్ చెక్కులను మంగళవారం ఆయన రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణామిల్క్ యూనియన్ అందిస్తున్న సేవలను పాడి రైతులు వినియోగించుకోవాలన్నారు.అనంతరం మిల్క్ యూనియన్ సౌజన్యంతో 120 మంది రైతులకు రైస్‌కుక్కర్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ విజయ డెయిరీ అధ్యక్షుడు తాళ్లూరి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, వాసు, రైతులు పాల్గొన్నారు.

మదర్‌థెరిస్సాకు నివాళి



గండ్రాయి(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో మదర్ థెరిస్సా జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్‌థెరిస్సా చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మదర్‌థెరిస్సా సేవలను కొనియాడారు. ఓ విద్యార్థిని మదర్‌థెరిస్సా వేషధారణలో ప్రత్యేకాకర్షణగా నిలిచింది. పాఠశాల హెచ్‌ఎం రమేష్‌బాబు, ఉపాధ్యాయులు సుబ్బారావు, పద్మావతమ్మ, ముక్తేశ్వరరావు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ ...

నందిగామటౌన్: మదర్ థెరిస్సా సేవలు మరువలేనివని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మాలెంపాటి ప్రసాద్ పేర్కొన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతిని నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. . ముందుగా ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. క్లబ్ ప్రతినిధులు సీతారామయ్య, శ్రీనివాసరావు, వెంకట శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, మహేంద్ర, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.